సాక్షి
వికారాబాద్

గురువారం । 18 । జూలై । 2024



చిల్లర కష్టాలు

మార్కెట్‌లో ఏ వస్తువు కొనుగోలు చేయాలన్నా క్రయ విక్రయదారులకు చిల్లర కష్టాలు తప్పడం లేదు. 8లో▸



సిబ్బందికి అభినందన

కారు దగ్ధమైన ఘటనలో వ్యక్తి ప్రాణాలు కాపాడిన ట్రాఫిక్ సిబ్బందిని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అభినందించారు. 8లో▸



అంగన్‌వాడీ బాట

చిన్నారులకు ఆటపాటలతో విద్యనందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 9లో▸



అనంతగిరి: శివారెడ్డిపేటలో మొహర్రం వేడుకల్లో భాగంగా పీర్ల ఊరేగింపు

భక్తిశ్రద్ధలతో మొహర్రం

జిల్లాలో బుధవారం మొహర్రం వేడుకను ఘనంగా నిర్వహించారు. మసీదుల వద్ద పీర్లను అందంగా ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ వేడుకలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



అనంతగిరి: సామూహిక భగవద్గీత పారాయణం చేస్తున్న మహిళలు

ఘనంగా తొలి ఏకాదశి

ఆషాఢమాస ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం జిల్లాలోని ఆలయాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. వికారాబాద్ పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో సామూహిక భగవద్గీత పారాయణం చేశారు.

న్యూస్‌రీల్

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పర్యటన రద్దు

తాండూరు: నియోజకవర్గంలో గురువారం ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పర్యటన రద్దయినట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఇటీవల మంత్రిని కలిసి బషీరాబాద్ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ పదవీ ప్రమాణ స్వీకారానికి రావాలని ఆహ్వానించారు. ఇందు కోసం 18వ తేదీని ఖరారు చేశారు. గురువారం రుణమాఫీ బిజీ షెడ్యూల్ కారణంగా మంత్రి పర్యటన రద్దయ్యింది. దీంతో బషీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ సభ్యుల పదవీ ప్రమాణ స్వీకారం ఈ నెల 22న నిర్వహించే అవకాశం ఉందని పార్టీ నాయకులు తెలిపారు.

నేడు రైతు నేస్తం

కొడంగల్: కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల్ మండలాల్లోని రైతు వేదికల్లో గురువారం సాయంత్రం రైతు నేస్తం కార్యక్రమం ఉంటుందని వ్యవసాయాధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడత రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులను ఉద్దేశించి మాట్లాడతారని తెలిపారు. కొడంగల్, బొంరాస్‌పేట, దుద్యాల, దౌల్తాబాద్ మండలాలకు చెందిన రైతులు వారి వారి గ్రామాల్లోని రైతు వేదికల వద్దకు మధ్యాహ్నం 3గంటల లోపు చేరుకోవాలని కోరారు.

గోవా డీసీసీబీని సందర్శించిన చైర్మన్లు



ధారూరు: దేశంలోనే అత్యధిక లాభాలు ఆర్జిస్తున్న ది గోవా స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్‌ను బుధవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని 42 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్లు సందర్శించారు. అక్కడి అధికారులతో మాట్లాడి అత్యధిక లాభాలు ఎలా సంపాదిస్తున్నారని ఆరా తీశారు. గోవా రైతులు పండించిన జీడి పప్పును ఖరీదు చేసి తమ పరిశ్రమలో శుద్ధి చేస్తామని, ప్యాకింగ్ అనంతరం దేశంలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తామని అక్కడి అధికారులు వివరించారు. ఈ వ్యాపారమే మాకు అత్యధిక లాభాలు తెచ్చిపెడుతోందని వారు వెల్లడించారు. తమ బ్యాంకు ద్వారా రైతులకు రుణాలు, గోల్డ్ లోన్ ఇస్తున్నట్లు తెలిపారు. రుణాలు పొందిన రైతులు సకాలంలో చెల్లించడం జరుగుతోందని అక్కడి అధికారులు తెలిపినట్లు ధారూరు మండలం హరిదాస్‌పల్లి పీఏసీఎస్ చైర్మన వెంకట్‌రెడ్డి తెలిపారు.

కుక్కల దాడిలో మూడేళ్ల చిన్నారికి గాయాలు

మొయినాబాద్: మూడేళ్ల చిన్నారిపై వీధికుక్కలు దాడి చేశాయి. గాయాలతో బయటపడిన బాలికను ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ సంఘటన మొయినాబాద్ మండలంలోని పెద్దమంగళారం గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన అమీర్‌గూడలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మేకగూడెం వెంకటేష్, సంతోష దంపతుల మూడేళ్ల కూతురు అఖిల మంగళవారం ఇంట్లో నుంచి బయటకు వచ్చింది. అక్కడే ఉన్న కుక్కలు ఒక్కసారిగా చిన్నారిపై దాడి చేశాయి. తల, మెడ, వీపు, కాళ్లు, చేతులపై కరిచాయి. సుమారు ఐదారు కుక్కలు ఒక్కసారి దాడి చేసి గాయపర్చాయి. చిన్నారి ఏడవడంతో చుట్టుపక్కలవారు గమనించి కుక్కలను తరిమేశారు. వెంటనే నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు.



46,633 మందికి రుణమాఫీ

మొదటి విడతలో భాగంగా రైతుల ఖాతాల్లో జమ కానున్న రూ.256 కోట్లు

జిల్లాలో సాగు విస్తీర్ణం 5.90లక్షల ఎకరాలు

రైతులు 2.50 లక్షల మంది

ఏటా రుణాలు పొందుతున్న అన్నదాతలు 1.70 లక్షల మంది

వికారాబాద్/బషీరాబాద్: మొదటి విడతలో కొంత మంది రైతులకే పంట రుణాలు మాఫీ కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఏటా దాదాపు 1.70 లక్షల మంది వ్యవసాయ రుణాలు పొందుతున్నారు. గత ఏడాది రూ. లక్షలోపు రుణం తీసుకున్న రైతులు 46,633 మంది కాగా వీరికి రూ.256,26,30,522 మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన జాబితాను అధికారులు విడుదల చేశారు. నేటి సాయంత్రం (గురువారం) వీరి బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రతి ఏటా సగటున ఆయా బ్యాంకులు రైతులకు రూ.3,500 కోట్ల వ్యవసాయ రుణాలు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకుంటున్నా.. రూ.1,800 కోట్ల నుంచి రూ. 2000 కోట్ల మించి ఇవ్వడం లేదు. ప్రభుత్వం రూ.2 లక్షల వరకు ఉన్న స్వల్ప కాలిక వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఆ పైబడి రుణాలు తీసుకున్న వారి సంఖ్య పది శాతం లోపే ఉంది. ఈ లెక్కన సుమారు రూ.1,500 కోట్ల రుణాలు మాఫీ కావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పీఎం కిసాన్ తరహాలో కాకుండా రైతు కుటుంబాలకు అనే నిబంధన తీసుకొచ్చింది. దీంతో జిల్లాలో మొదటి విడతలో 46,633 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తించనుంది.

జిల్లాలో 2.50 లక్షల మంది రైతులు

జిల్లాలో 5.90లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా 2.50లక్షల మంది రైతులు ఉన్నారు. ఏటా సగటున 1.7 లక్షల నుంచి 1.8 లక్షల మంది రైతులు ఆయా బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాలు పొందుతున్నారు. సాగు భూమికి సగటున ఎకరానికి రూ.30,000 చొప్పున పంట రుణాలిస్తే రూ.1,700 కోట్లు అవుతుంది. అయితే కొన్ని రకాల వాణిజ్య పంటలకు ఎకరానికి రూ.50 వేల నుంచి లక్ష వరకు కూడా ఇవ్వాల్సి ఉంటుంది. ఈ లెక్కన ప్రతి ఏటా రూ.3,500 కోట్లు పంట రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. అయితే రూ.1,800 కోట్లు మించి రుణాలు ఇవ్వడం లేదు. ఇందులో దీర్ఘకాలిక రుణాలు పొందుతున్న రైతులు కూడా ఉండటంతో 1.5 నుంచి 1.6 లక్షల మందికి రుణమాఫీ వర్తించాల్సి ఉండగా రైతులు కాకుండా రైతు కుటుంబాలకు అనే నిబంధన పెట్టడంతో ఆ సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశం కనిపిస్తోంది.

మండలాల వారీగా రుణమాఫీ

మండలం	రైతుల సంఖ్య	మాఫీ రూపాయల్లో..
బంట్వారం	924	5.67 కోట్లు
ధారూరు	2766	14.88 కోట్లు
మర్పల్లి	3108	16.94 కోట్లు
మోమిన్‌పేట్	2100	11.55 కోట్లు
వికారాబాద్	2527	12.83 కోట్లు
బషీరాబాద్	2109	12.09 కోట్లు
కోట్‌పల్లి	1102	6.66 కోట్లు
పెద్దేముల్	1910	11.91 కోట్లు
తాండూరు	2071	11.97 కోట్లు
యాలాల్	2464	14.00 కోట్లు
చౌడాపూర్	2144	11.67 కోట్లు
దోమ	3032	16.38 కోట్లు
కుల్కచర్ల	2402	13.26 కోట్లు
పరిగి	2981	16.54 కోట్లు
పూడూర్	2437	12.11 కోట్లు
బొంరాస్‌పేట	2954	17.18 కోట్లు
దౌల్తాబాద్	3682	20.10 కోట్లు
కొడంగల్	2968	16.66 కోట్లు
నవాబుపేట్	2952	14.51 కోట్లు

మాఫీ ఎప్పటి నుంచి అంటే..

రుణమాఫీ ఎవరికీ వర్తిస్తుందంటే 12 డిసెంబర్ 2018 మొదలు కొని 9 డిసెంబర్ 2023 లోపు తీసుకున్న స్వల్ప కాలిక పంట రుణాలకు ఈ పథకం అమలు చేస్తారు. ఇందులో రుణం, వడ్డీ మొత్తం కలిపి రూ.2 లక్షల వరకు రుణాన్ని ప్రభుత్వం మాఫీ చేయనుంది. ప్రభుత్వం ఇచ్చిన కాల పరిమితి లోపు రైతులు వారి రుణాలను రెన్యూవల్ చేసుకున్న వారి ఖాతాల్లో నిధులు జమ చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా జిల్లాలో మొదటి విడత రుణమాఫీ రైతులు 46,633 మంది ఉండగా అందులో అత్యధికంగా 12,996 మంది లబ్ధిదారులు పరిగి నియోజకవర్గంలో ఉన్నారు.

మీ సేవలు హర్షణీయం

వాట్సాప్ వేదికగా అధికారులను అభినందించిన కలెక్టర్

దోమ: మండల అధికారుల పనితీరు ఎంతో బాగుందని కలెక్టర్ ప్రతీక్ జైన్ కితాబునిచ్చారు. ఈ నెల 12న బొంపల్లి, బాస్‌పల్లి, దోమ ప్రభుత్వ పాఠశాలలను కలెక్టర్ సందర్శించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో స్కూళ్లలో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. బాస్‌పల్లి పాఠశాల వంట గదిలో కార్మికురాలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని నేరుగా పరిశీలించారు. ఆమెతో స్వయంగా మాట్లాడారు. వంట గదికి విద్యుత్ సదుపాయం లేదని, ఫ్లోర్ దెబ్బతిందని, వెలుతురు రావడం లేదని ఆమె కలెక్టర్‌కు విన్నవించింది. స్పందించిన కలెక్టర్ వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి చంద్రకాంత్‌కు సూచించారు. పనులకు సంబంధించిన ఫొటోలను తనకు పంపాలని ఆదేశించారు. అలాగే పాఠశాల ఆవరణలో మొక్కలు నాటాలన్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శి చంద్రకాంత్ బుధవారం వంట గదికి ఫ్లోరింగ్ చేయించారు. పొగ బయటికి వెళ్లేందుకు ఎక్జిస్టింగ్ ఫ్యాన్, విద్యుత్ సదుపాయం కల్పించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను కలెక్టర్ వాట్సాప్ నంబర్‌కు పోస్ట్ చేశారు. వాటిని చూసిన కలెక్టర్.. ఎంపీడీఓ మహేశ్‌బాబు, ఎంపీఓ సోమలింగం, పంచాయతీ కార్యదర్శి చంద్రకాంత్‌ను అభినందిస్తూ వాట్సాప్ వేదికగా పోస్టు పెట్టారు.



అధికారులను అభినందిస్తూ కలెక్టర్ చేసిన వాట్సాప్ పోస్ట్



బాస్‌పల్లి పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ మహేశ్‌బాబు, స్కూల్ సిబ్బంది

ప్రాణం తీసిన కుర్ర‘కారు’ డ్రైవింగ్

- కారు తీసుకుని బయటకు వచ్చిన నలుగురు మైనర్లు
- తిరుగు ప్రయాణంలో బోల్తా పడిన వాహనం
- ఒకరి మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు
- శంకర్‌పల్లిలో ఘటన



ప్రమాదానికి గురైన కారు



విఘ్నేష్ (ఫైల్)

శంకర్‌పల్లి: ఇంట్లో చెప్పకుండా కారు తీసుకుని బయటకు వచ్చిన నలుగురు స్నేహితులు.. తిరుగు ప్రయాణంలో ప్రమాదం బారిన పడ్డారు. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా.. మిగిలిన ముగ్గురికి తీవ్ర గాయాల య్యాయి. వీరంతా మైనర్లు కావడం గమనార్హం. ఈ ఘటన బుధవారం శంకర్‌పల్లి మున్సిపల్ కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న నలుగురు స్నేహితులు. తొలిఏకాదశి, మొహర్రం సందర్భంగా బుధవారం సెలవు కావడంతో ఉదయం క్రికెట్ ఆడాలనుకున్నారు. అందరూ కలిసి మహరాజ్‌పేట్ గ్రామంలో ఉన్న మరో మిత్రుడి వద్దకు వెళ్దామనుకున్నారు. ఓ బాలుడు ఇంట్లో చెప్పకుండా కారు తీసుకుని రావడంతో నలుగురూ కలిసి మహరాజ్‌పేట్‌కు బయల్దేరారు. మార్గమధ్యలో మోకిలతండాలో మరో స్నేహితుడిని ఎక్కించుకుని మహరాజ్‌పేట్ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తండాలో ఉండే మిత్రుడిని దింపేశారు. కారు బుల్కాపూర్ రాఘవేంద్ర స్వామి ఆలయ సమీపంలోకి రాగానే డ్రైవింగ్‌లో ఉన్న బాలుడు ఏసీ తగ్గిస్తుండగా.. ఎదురుగా బండరాయి గమనించి తప్పించేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో అతి వేగంగా ఉన్న వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ప్రహరీని ఢీకొని పల్టీకొట్టింది. డ్రైవర్ వెనుక సీటులో కూర్చున్న విఘ్నేష్(14)కు బలమైన గాయాలవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో విద్యార్థి కుడి చేతి ఎముక విరిగింది. మిగిలిన ఇద్దరు స్వల్ప గాయాలతో బటయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. క్షతగాత్రులకు శంకర్‌పల్లిలో చికిత్స అందిస్తున్నారు. డ్రైవింగ్ చేసిన బాలుడు, కారు ఓనర్ అశోక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నీటి సంఘం ఎన్నికలెప్పుడో?

- 2006లో చివరిసారిగా నిర్వహణ
- ఆ తర్వాత ఊసెత్తని ప్రభుత్వాలు

దౌల్తాబాద్: పదహారేళ్లుగా నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో చెరువులు అధ్వానంగా మారాయి. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చెరువులు, కుంటలకు మరమ్మతులు చేసినా వాటిపై అజమాయిషీ లేక.. నీటి విడుదలపై దృష్టి పెట్టేవారు కరువయ్యారు. ఒకప్పుడు చెరువుల అభివృద్ధి, నిర్వహణ,ఆయకట్టుకు నీటి సరఫరా తదితర పర్యవేక్షణ పనులను నీటి సంఘాల పాలకవర్గాలే చూసుకునేవి.16 ఏళ్లుగా ప్రభుత్వాలు ఎన్నికలు నిర్వహించకపోవడంతో పర్యవేక్షణ కరువైంది. దీంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారు. కొన్ని గ్రామాల్లో పనులు చేపట్టకుండానే నిధులు కాజేశారు.

గతంలో ఇలా..

గత ప్రభుత్వాలు సాగునీటి సంఘాలకు ఎన్నికలు నోటిఫికేషన్ విడుదల చేయగానే 100 ఎకరాల ఆయకట్టు ఉన్న ప్రధాన చెరువుల ఆయకట్టుకు రైతులు చైర్మన్‌తోపాటు డైరెక్టర్లను ఎన్నుకునేవారు. పాలకవర్గాల సభ్యులు చెరువుల నిర్వహణతోపాటు నీటిని పంట పొలాలకు విడుదల చేసుకుని పొదుపుగా వాడుకునేలా చర్యలు తీసుకునేవారు. అంతేకాకుండా రైతులను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులు నిర్వహించేవారు. నీటి సంఘాల సభ్యులు లేకపోవడంతో కొన్ని చెరువులు శిథిలావస్థకు చేరుకున్నాయి. తూములు పనిచేయడం లేదు. దీంతో చివరి ఆయకట్టు భూములకు సాగు నీరు అందడం లేదు.



దౌల్తాబాద్‌లోని పెద్ద చెరువు

2008 నుంచి ఎన్నికలు బంద్

మండలంలో తొమ్మిది నోటిఫైడ్ చెరువులు ఉన్నాయి. ఇందులో సుమారు 2 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 2006లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రధాన చెరువులకు సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. వాటి పదవీకాలం 2008లో ముగిసింది. అప్పటి నుంచి తిరిగి ఎన్నికలు నిర్వహించిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా ఎన్నికలు నిర్వహించి చెరువులను మరింత అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

> **ఆదేశాలు రాలేదు**
>
> నీటి సంఘాల ఎన్నికలు ప్రభుత్వ పరిధిలోని అంశం. ఎన్నికలు నిర్వహించాలని తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఆదేశాలు వస్తే తప్పకుండా ఎన్నికలు నిర్వహిస్తాం.
>
> – విజయ్‌కుమార్, తహసీల్దార్, దౌల్తాబాద్

క్లుప్తంగా

బైక్‌ అదుపుతప్పి.. యువకుడికి గాయాలు



ప్రమాద స్థలంలో యువకుడు

దుద్యాల్‌: బైకు అదుపుతప్పి యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. దుద్యాల మండలం హస్నాబాద్‌ గ్రామానికి చెందిన చాకలి హరికృష్ణ పని నిమిత్తం బైక్‌పై కోస్గి పట్టణానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో నాచారం వద్ద నిర్మిస్తున్న వంతెన వద్ద బైక్‌ అదుపుతప్పి పక్కనే ఉన్న పొలంలో పడిపోయాడు. ఈ ప్రమాదంలో కృష్ణ తలకు తీవ్ర గ్రాయాలు అయ్యాయి. అటుగా వెళ్తున్న యాదగిరి అనే వ్యక్తి.. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కోస్గి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.

ఆటో ఢీ, మహిళకు..



గాయపడిన శోభమ్మ

తాండూరు టౌన్‌: ఆటో ఢీకొట్టిన ఘటలో ఓ మహిళ గాయపడింది. ఈ సంఘటన తాండూరు పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి అంతారం గ్రామానికి చెందిన మ్యాతరి శోభమ్మ బుధవారం సాయంత్రం అంతారం నుంచి ఆటోలో కుటుంబ సభ్యులతో కలిసి పట్టణానికి వచ్చింది. ఇందిరాచౌక్‌లో ఆటో దిగి ఆమె నడుచుకుంటూ వెళ్తుండగా.. ఓ ఆటో ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శోభమ్మ చెయ్యి విరిగింది. కుటుంబీకులు వెంటనే ఆమెను తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం అక్కడి వైద్యులు హైదరాబాద్‌కు రిఫర్‌ చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ముదిరాజ్‌ల ఆర్థికాభివృద్ధికి కృషి

ముదిరాజ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ జ్ఞానేశ్వర్‌ ముదిరాజ్‌



జ్ఞానేశ్వర్‌ ముదిరాజ్‌ను సన్మానిస్తున్న జిల్లా మత్స్యకార సంఘం సభ్యులు

మొయినాబాద్‌ రూరల్‌: ముదిరాజ్‌లు ఆర్థికంగా బలోపేతం చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున కృషి చేస్తానని ముదిరాజ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ బొర్ర జ్ఞానేశ్వర్‌ ముదిరాజ్‌ అన్నారు. నూతనంగా ఎన్నికైన ఆయనను మత్స్యకార సంఘం జిల్లా చైర్మన్‌ మహేందర్‌ ముదిరాజ్‌.. సభ్యులతో కలిసి బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్‌ బొర్ర మాట్లాడారు. గ్రామాల్లో ముదిరాజ్‌లు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. విద్యతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని వెల్లడించారు. కాంగ్రెస్‌ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందుతున్నాయని పేర్కొన్నారు. అందులో భాగంగానే ముదిరాజ్‌ కార్పొరేషన్‌ ద్వారా వచ్చే సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందరికీ అందేలా కృషి చేస్తానని స్పష్టంచేశారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం నాయకులు గోపాల్‌, భిక్షపతిముదిరాజ్‌, రమేష్‌ముదిరాజ్‌, ప్రవీణ్‌ముదిరాజ్‌, జంగయ్యముదిరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి: అనంతగిరిగుట్ట అనంతపద్మనాభ స్వామివారి ఆలయ సన్నిధిలో భక్తజనం

ఘనంగా తొలి ఏకాదశి

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



మోమిన్‌పేట: విశేష అలంకరణలో దర్శనమిచ్చిన విఠలేశ్వరస్వామి

ఆషాఢమాస ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తజనం వేకువజామునే దేవాలయాలకు చేరుకుని పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. మహిళలు ఉపావాస దీక్షలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వికారాబాద్‌ అయ్యప్ప స్వామి ఆలయంలో గీతావాహిని ఆధ్వర్యంలో సామూహిక భగవద్గీత పారాయణం గావించారు. అనంతగిరిగుట్ట అనంతపద్మనాభ స్వామి ఆలయానికి భక్తులు బారులు తీరారు. కుల్కచర్ల మండలం కామునిపల్లిలో భక్తులు 8కిలో మీటర్ల మేర కాలినడకన దోమ మండలం మైలారం వేంకటేశ్వర ఆలయానికి వెళ్లారు. కొడంగల్‌ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో శ్రీవారి మూలమూర్తికి అర్చకులు, పూజలు ఘనంగా నిర్వహించారు.

– సాక్షి, నెట్‌వర్క్‌



కొడంగల్‌: విష్ణు సహస్ర పారాయణం చేస్తున్న ధార్మిక సేవా సమితి సభ్యులు



అనంతగిరి: అయ్యప్పదేవాలయంలో..



కుల్కచర్ల: కామునిపల్లి నుంచి పాదయాత్రగా భక్తులు

చిల్లర కష్టాలు

- దొరకని రూ.10, 20 నోట్లు
- జనాలకు తప్పని ఇక్కట్లు

దౌల్తాబాద్‌: రోడ్డు పక్కన టీస్టాల్‌లో చాయ్‌ తాగాలన్నా, పానీ పూరి తినాలన్నా.. మార్కెట్లో కూరగాయలు కొనుగోలు చేయాలన్నా క్రయవిక్రయదారులకు చిల్లర కష్టాలు తీవ్ర మయ్యాయి. ఇందుకు కారణం మార్కెట్‌లో రూ.10,20,50నోట్లు లభ్యం కాకపోవడమే. ప్రస్తుతం డిజిటల్‌ లావాదేవిలు పెరిగిన నేపథ్యంలో సమస్య ఉత్పన్నమయింది.

కనిపించని పది కాగితం

ఇప్పటికీ చాలా దుకాణాల్లో ఫోన్‌పే, గూగుల్‌పే వంటి ఆన్‌లైన్‌ పేమెంట్‌ చెల్లింపులు లేవు. ఈఈ షాపుల్లో ఎవరికైనా కావాల్సిన సరుకులు తీసుకున్నాక డబ్బులు చెల్లించడంతో చిల్లర సమస్య తరచూ ఎదురవుతోంది. కొన్ని సందర్భాల్లో దుకాణదారుడు, కొనుగోలు దారుడి మధ్య గొడవలకు దారిస్తుండటం గమనార్హం.



చిరిగినవి చెల్లవు..

ప్రస్తుతం మార్కెట్లో రూ.10నోట్లు లేకపోవడం ఒకటైతే.. ఒకవేల ఉన్నా.. అవి అత్యధికంగా చిరిగినవే ఉండటంతో వాటిని వ్యాపారులు, కొనుగోలు దారులు చెల్లని కాగితాల కిందే జమకడుతున్నారు. ఇచ్చిపుచ్చుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. బ్యాంకుల్లోనూ ఖాతాదారులు పెద్దనోట్లు తీసుకోవడానికి మక్కువ చూపుతున్నట్లు సమాచారం. దీంతో మార్కెట్లో చిల్లర నోట్ల కొరత ఏర్పడింది. రూ10 నాణేలూ లేవు. ఉన్నా.. వాటిని చెల్లుబాటు కాయిన్స్‌ కిందే లెక్కగట్టడం గమనార్హం. బ్యాంకు అధికారులు ఈ సమస్యను పరిష్కరించి, చిల్లర నోట్లు మార్కెట్లో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని వ్యాపారులు, ప్రజలకు కోరుతున్నారు.

చెంచుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



రైతులకు పంపు సెట్లు పంపిణీ చేస్తున్న మంత్రి జూపల్లికృష్ణారావు, ఎమ్మెల్యేలు కసిరెడ్డి, వీర్లపల్లి

- ఎక్సైజ్‌, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- చెంచు రైతులకు వ్యవసాయ మోటార్ల పంపిణీ

కడ్తాల్‌: ఆదివాసీ చెంచుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎక్సైజ్‌, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పోడు భూముల విషయంలో ఇప్పటికే సాగులో ఉన్న గిరిజనులకు న్యాయం చేసేందుకు కట్టుబడి ఉందన్నారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌ మండలం అన్మాస్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధి జమ్ములాబావితండాలో బుధవారం చెంచు రైతులకు బోరుమోటార్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అధ్యక్షత వహించగా, మంత్రి జూపల్లి, షాద్‌నగర్‌ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ సూరజ్‌కుమార్‌, జిల్లా గిరిజన సంక్షేమ సహాయ అధికారి రామేశ్వరి దేవి, సహాయ అధికారి వెంకటయ్య, తహసీల్దార్‌ ముంతాజ్‌, ఎంపీడీఓ సుజాత, అధికారులతో కలిసి 26 మంది చెంచు రైతులకు మంత్రి పంపు సెట్లను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడారు. చెంచుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం అనేక పథకాలు రూపొందించి అమలు చేస్తుందన్నారు. దశాబ్దాల క్రితం చెంచు రైతులకు ప్రభుత్వం ఇచ్చిన భూములను సాగుకు యోగ్యంగా తయారు చేసేందుకు పంపు సెట్లు అందజేశామని తెలిపారు. అటవీ ఉత్పత్తుల ద్వారా చెంచుల ఆదాయ వనరులు పెంచి, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జమ్ములాబావితండా చెంచులు గవర్నర్‌ పేరిట ఉన్న తమ భూములకు పట్టాలు ఇప్పించాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు బాలాజీ సింగ్‌, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్‌, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్‌, ఐటీడీఏ అధికారి వెంకటయ్య, సింగిల్‌ విండో చైర్మన్‌ వెంకటేశ్‌గుప్తా, నాయకులు నర్సింహ, బీక్యానాయక్‌, బీచ్యానాయక్‌, రాములు, శంకర్‌, భాస్కర్‌రెడ్డి, చందోజీ, వెంకటేశ్‌, జగన్‌, నర్సింహ, రమేశ్‌, మహేందర్‌, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ సిబ్బందికి సీపీ అభినందన



ట్రాఫిక్‌ సిబ్బందికి రివార్డులు అందజేసి అభినందిస్తున్న సీపీ సుధీర్‌బాబు

మీర్‌పేట: మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌ పరిధిలో నడుస్తున్న కారు ఇటీవల దగ్ధమైన సంఘటన విధితమే. ఈ ఘటనలో వ్యక్తి ప్రాణాలు కాపాడిన ట్రాఫిక్‌ సిబ్బందిని రాచకొండ కమిషనర్‌ సుధీర్‌బాబు బుధవారం అభినందించి రివార్డు అందజేశారు. ఈ నెల 15న మందమల్లమ్మ నుంచి బాలాపూర్‌ చౌరస్తా వైపు వెంకటేశ్‌ నాయక్‌ కారులో ప్రయాణిస్తుండగా.. ఏసీ నుంచి పొగలు వచ్చి కారుకు మంటలు వ్యాపించాయి. అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్‌ సిబ్బంది ఏ.నర్సింగ్‌రావు, జి.కృష్ణ, ఆర్‌.సాయిరాం గమనించి కారు ఆపి వెంకటేశ్‌ను అప్రమత్తం చేసి ప్రాణాలు కాపాడారు. మంటలు తీవ్రం కావడంతో ఇతర వాహనాలకు అంటుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. తక్షణమే స్పందించి ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకున్న సీపీ సిబ్బంది సమయస్ఫూర్తిని అభినందించి తన కార్యాలయానికి పిలిపించుకుని రివార్డును ఇచ్చారు. కార్యక్రమంలో ఎల్బీనగర్‌ ట్రాఫిక్‌ డీసీపీ శ్రీనివాస్‌, వనస్థలిపురం ట్రాఫిక్‌ సీఐ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

యువతితో అసభ్యంగా ప్రవర్తించిన కండక్టర్‌ అరెస్ట్‌

గచ్చిబౌలి: బస్సులో యువతిపట్ల అసభ్యంగా ప్రవర్తించిన కండక్టర్‌ను రాయదుర్గం పోలీసులు బుధవారం అరెస్ట్‌ చేశారు. ఇన్‌స్పెక్టర్‌ సీహెచ్‌.వెంకటేశ్‌ తెలిపిన ప్రకారం.. పుప్పాలగూడ యువతి.. పోటీ పరీక్షలకు హిమాయత్‌నగర్‌లో కోచింగ్‌ తీసుకుంటోంది. ఈ నెల 15న ఉదయం 8 గంటలకు పుప్పాలగూడలో ఫారూఖ్‌నగర్‌ డిపో ఆర్టీసీ బస్సు ఎక్కింది. కండక్టర్‌ బి.సుబ్బారావు ఆమెపట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. బస్సులో తనకు ఎదురైన చేదు అనుభవం గురించి సదరు యువతి 16న ఎక్స్‌లో పోస్ట్‌ చేయడం చర్చనీయాంశమైంది. సైబరాబాద్‌ పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం పోలీసులు బాధితురాలి నుంచి ఫిర్యాదు తీసుకున్నారు. బీఎన్‌ఎస్‌ 75 సెక్షన్‌ కింద కేసు నమోదు చేసి కండక్టర్‌ను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు.

పెండింగ్‌ చలాన్లు వెంటనే చెల్లించండి

మొయినాబాద్‌రూరల్‌: వాహనాదారులు పెండింగ్‌లో ఉన్న చలాన్లను వెంటనే చెల్లించాలని రాజేంద్రనగర్‌ ట్రాఫిక్‌ ఆర్‌ఐ నర్సింహాగౌడ్‌ కోరారు. బుధవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌ స్వామి నారాయణ గురుకుల్‌ సమీపంలో చలాన్ల రికవరీలో భాగంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను ఆపి నంబర్ల ఆధారంగా చలాన్లను చెల్లించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాదారులు హెల్మెట్‌, నంబర్‌ ప్లేట్‌ లేకుండా, ట్రిబుల్‌ రైడింగ్‌ తదితర కారణాలతో విధించిన చలాన్లను వెంటనే చెల్లించుకోవాలన్నారు. వాహనాదారులు ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ సురక్షిత ప్రయాణాన్ని కొనసాగించాలని కోరారు. తనిఖీల్లో ట్రాఫిక్‌ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దుద్యాల్‌: హస్నాబాద్‌ మొహర్రం వేడుకలో జనసంద్రం



అనంతగిరి: శివారెడ్డిపేట మొహర్రం వేడుకలో పాల్గొన్న స్పీకర్‌ ప్రసాద్‌కుమార్‌



మోమిన్‌పేట: టేకులపల్లిలో..

సవార్ల సంబురం

- కన్నుల పండువగా పీర్ల ఊరేగింపు
- కొండాపూర్‌కలాన్‌లో మైనార్టీ కుటుంబం లేకున్నా.. మొహర్రం

త్యాగానికి ప్రతీకగా.. కుల మతాలకతీతంగా నిర్వహించే మొహర్రం పండుగ బుధవారం జిల్లాలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పల్లెల్లో సవార్ల జోరు హోరెత్తింది. డప్పుచప్పుళ్ల హోరు.. నిర్వాహకుల కాలి గజ్జల గళగళల జోరు, చిన్నారుల కేరింతలతో పీర్ల ఊరేగింపు ఆద్యంతం కన్నుల పండువగా సాగింది. ధారూరు మండలం కొండాపూర్‌కలాన్‌ గ్రామంలో ఒక్క ముస్లిం కుటుంబం లేకపోయినా.. శతాబ్ద కాలంగా హిందువులే మొహర్రం నిర్వహిస్తున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్‌



యాలాలలో..



పూడూరులో..



పరిగి: మొహర్రం వేడుకల్లో మున్సిపల్‌ చైర్మన్‌ తదితరులు



దోమ: ఐనాపూర్‌లో..



ధారూరు: కుక్కింద కొండాపూర్‌కలాన్‌లో పీర్ల ఊరేగింపు



తాండూరు టౌన్‌ సాయిపూర్‌లో.. అలై ఆడుతున్న భక్తులు



కుల్కచర్లలో..



మర్పల్లి: తుమ్మలపల్లిలో..



బంట్వారం: కరీంపూర్‌లో..



బషీరాబాద్‌: నావంద్గీలో..



దౌల్తాబాద్‌లో.. పీర్ల ఊరేగింపు



అనంతగిరి: వికారాబాద్‌ పట్టణం గంగారంలో